## క్లుప్తంగా

### తూనికల్లో మోసగిస్తే కఠిన చర్యలు



**పిడుగురాళ్ల:** కాటాలో తేడా వస్తే సహించేది లేదని తూనికల కొలతల అధికారి జాన్ సైదా అన్నారు. పట్టణంలోని పలు దుకాణాల్లో అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ సైదా మాట్లాడుతూ... ఆకస్మికంగా తనిఖీలు ఉంటాయని గుర్తు చేశారు. తీరు మారకుంటే వ్యాపారం చేసేవారిపై కూడా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

### విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ పంపిణీ



**గురజాల:** స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు కృష్ణా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం పెన్నులు, ఎగ్జామ్ ప్యాడ్‌లు పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ లేళ్ల కృష్ణ మాట్లాడుతూ మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాల అధిరోహించాలన్నారు. ఎంఈవో సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

### సాయిబాబాకు ప్రత్యేక పూజలు



**పాలువాయి జంక్షన్ (రెంటచింతల):** మండలంలోని పాలువాయి జంక్షన్ వద్ద షిరిడీ సాయిబాబా దేవస్థానంలో గురువారం ప్రధాన అర్చకులు గోపాల్ పాండే ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనేక గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భజనబృందం ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. దేవస్థానం చైర్మన్ పందిరి శ్రీనివాసరావు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

### ఘనంగా మొల్ల జయంతి

**గురజాల రూరల్:** వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ కార్యాలయంలో బీసీ విభాగం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, మన్నెం ప్రసాద్, కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్, కొమ్మినేని రవిశంకర్, దేవండ్ల నారాయణ, కేతినేని వెంకటేశ్వర్లు, గుండెబోయిన లింగయ్య, గోల్ల సైదయ్య, సుభాని తదితరులు పాల్గొన్నారు.

### పట్టణ అభివృద్ధికి చర్యలు



**మాచర్ల:** పట్టణ పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరును రీజినల్ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ పి.మధుకుమార్ గురువారం పరిశీలించారు. పురపాలక సంఘం చైర్మన్ పోలూరి నరసింహారావు ఆయనతో ఆయా అంశాలు చర్చించారు. మాయా బజారు, బస్టాండ్ వద్ద, సాగర్ రోడ్డులో నూతనంగా షాపులు నిర్మాణం గురించి మాట్లాడారు. గుంటూరు రోడ్డులో భూముల గురించి, నూతన మాస్టర్ ప్లాన్ అనుమతిపైనా చర్చించారు. కమిషనర్ వేణుబాబు, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ జె.పూర్ణచంద్రరావు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు

**పిడుగురాళ్ల:** పట్టణంలోని ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సింగిల్ యూస్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వినియోగం పెరిగిందని తెలిపారు. ఎవరైనా ఈ బ్యాగ్‌లను ఉపయోగించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తోపుడు బండ్లపై వ్యాపారం చేసేవారికి రూ. 500 నుంచి రూ.25,000 వరకు పెనాల్టీ విధిస్తామన్నారు.

### గృహ నిర్మాణానికి ఆర్థిక సాయం పెంపు

**కారెంపూడి:** ప్రధాన మంత్రి గ్రామీణ గృహ నిర్మాణం పథకం కింద పేదలకు ప్రభుత్వం అదనపు సాయాన్ని ప్రకటించిందని కారెంపూడి ఎంపీడీఓ జి. శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారుల్లో బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, చెంచులకు రూ.లక్ష సాయం అందనుందని పేర్కొన్నారు. గడువు లోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని తెలిపారు.

# త్రిదశల సంగమమే కారుణ్య వసంతం

- మొదటి దశ ఉపవాసాలు పూర్తి
- ఇప్పటికే ప్రారంభమైన రెండోదశ రోజాలు
- కఠిన దీక్షలతో మానవ పరివర్తన
- ఆత్మ, దేహం అల్లాహ్ కోసం అంకితం



దువా చేస్తున్న ముస్లిం మహిళలు

**యడ్లపాడు:** ఇస్లాం మతంలోని అత్యంత పవిత్రమైన మాసమైన రంజాన్ 29 లేదా 30 రోజుల పాటు కొనసాగుతుంది. సంక్షేమం, శాంతి, భక్తి పరవశంతో నిండిన రంజాన్ మాసం ముస్లింల కోసం దైవ అనుగ్రహానికి ద్వారం లాంటిది. ఈ నెలలో ముస్లింలు కఠిన దీక్ష పాటిస్తూ, కేవలం ఆహారాన్ని త్యజించడం మాత్రమే కాదు, హృదయాన్ని శుద్ధి, ఆత్మవిశ్లేషణ చేసుకోవడం, సమాజానికి మేలుచేసే మార్గాన్ని ఎంచుకోవడం వంటి కార్యాలతో తమ జీవితాన్ని పరిశుభ్ర పరుస్తారు.

**మూడు దశల పవిత్ర ప్రయాణం**

ఉపవాస దీక్ష (రోజా) పాటించే ఈ మాసాన్ని మత పెద్దలు మూడు దశలుగా విభజించి, ఆధ్యాత్మిక పరంగా మరింత లోతుగా అనుసరిస్తారు. అవి దయ, క్షమాపణ, విమోచనం రూపంలో ఒక్కొక్క దశ ఒక్కో పవిత్రమైన సందేశాన్ని మోసుకొస్తుంది. ప్రతి దశకు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక అర్థం, అంతరార్థం ఉంటుంది. 'రహమత్ కా అష్ర' (అల్లాహ్ కరుణకు అంకితమైన మొదటి 10 రోజులు), 'మగ్‌ఫిరత్ కా అష్ర' (పాపాల నుంచి క్షమాభిక్ష పొందే రెండో 10 రోజులు), 'జహన్నం సే నజాత్ కా అష్ర'(నరకం నుంచి విముక్తి కోసం ప్రార్థించే చివరి 10 రోజులు) మంగళవారంతో మొదటి దశ పూర్తయి, బుధవారం నుంచి రెండో దశ ప్రారంభమైంది.

**1. రహమత్ అష్ర (కారుణ్య దినాలు)**

రంజాన్ మొదటి పది దినాలు 'రహమత్ కా అష్ర'గా పిలవబడతాయి. అల్లాహ్ అపారమైన దయ, కరుణ రూపంలో తన అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడని విశ్వసిస్తారు. దురాచారాలను విడచి, సత్కార్యాలను అలవాటు చేసుకోవాలని మత పెద్దలు సూచిస్తారు. భక్తులు తమ హృదయాలను కరుణతో వెలిగించుకుని, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**2. మగ్‌ఫిరత్ అష్ర (క్షమాభిక్ష దినాలు)**

ఇది పాప విమోచన దశ. గతంలో చేసిన తప్పిదాలకు అల్లాహ్ క్షమాపణ కోరే సమయమే మన్నింపు దశగా పరిగణిస్తారు. ఈ సమయంలో చేసిన ప్రతి మంచిపనికి 70 రెట్లు ఫలితం దక్కుతుందనే విశ్వాసం ఉంది. భక్తులు ఆత్మపరిశీలన చేసుకుంటారు. ఇతరులకు సహాయం, అన్నదానం చేయడం, పేదలకు తోడుగా నిలవడం వంటి పనులు ఎక్కువగా చేస్తూ ప్రాయశ్చిత్తం చేసుకుంటారు.

**3. జహన్నమ్ సే ఫనాహ్ మాంగ్‌నే కా అష్ర (నరకవిముక్తి దినాలు)**

చివరిది నరకం నుంచి విమోచన. ఇది నరక భయాన్ని తొలగించుకునేందుకు భక్తులు తమ మనసును, ఆలోచనలను పూర్తిగా అల్లాకు అంకితం చేస్తారు. ఎతికాఫ్ అనే ప్రత్యేక ఆచారం పాటిస్తూ, మసీదుల్లోనే గడుపుతూ నిరంతర ప్రార్థనలు చేస్తారు. కుటుంబ బంధాలను, భౌతిక ప్రపంచాన్ని తాత్కాలికంగా విడిచి, పరమాత్మ పరాయణంగా మిగిలిపోతారు. పరలోకంలో శాశ్వత శాంతిని పొందేందుకు, అల్లాహ్ చిత్తాన్ని అనుసరించేందుకు ఈ దశ అత్యంత కీలకమైనదిగా భావిస్తారు. ఇందులోని పవిత్ర రాత్రులలో లైలతుల్ ఖదర్ (అదృష్ట రాత్రి) ప్రత్యేకమైనది. ఈ రోజుల్లో ముస్లింలు శుద్ధ హృదయంతో ఆచరణ చేయడం ద్వారా స్వర్గాన్ని పొందాలని ప్రార్థిస్తారు.

## పదో తరగతి పరీక్షలకు నాలుగు కేంద్రాలు



ఓ పరీక్షా కేంద్రంలో వసతులను పరిశీలిస్తున్న ఎంఈవో-2 శివనాగేశ్వరావు

**రెంటచింతల:** పదో తరగతి పరీక్షలను మండల కేంద్రమైన రెంటచింతలలో నాలుగు కేంద్రాలలో ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ-2 వై.శివనాగేశ్వరావు అన్నారు. గురువారం పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించారు. కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సెయింట్ జోసఫ్ హైస్కూల్, వైఆర్ఎస్ హైస్కూల్, సెయింట్ ఆన్స్, ఫాతిమా విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 840 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎండల కారణంగా ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఆరోగ్య కార్యకర్తలు తగిన మందులతో అందుబాటులో ఉంటారన్నారు. తుమ్మకోట - పాలువాయి ఒక బస్సు, మల్లవరం - జెట్టిపాలెం, గోలి, మిట్టగుడిపాడు మీదుగా మరొకటి, మంచికల్లు -నుంచి పాలువాయిగేటు మీదుగా మూడో బస్సును రెంటచింతలలోని పరీక్షా కేంద్రాల వరకు నడపనున్నారు.

## ఘనంగా వీరభద్రుని కల్యాణోత్సవం



స్వామి వారి కల్యాణం చేస్తున్న వేదపండితులు

**గురజాల రూరల్:** మండల పరిధిలోని గంగవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి 31వ వార్షిక కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి పంచామృతాలతో మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు వేకువజాము నుంచి స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. మహోత్సవంలో పీట్లపై దంపతులు కూర్చున్నారు. సాయంత్రం స్వామి వారిని ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## వైద్య శిబిరానికి స్పందన



శిబిరాన్ని పరిశీలిస్తున్న సుబ్బారావు తదితరులు

**గురజాల:** స్థానిక భవిత పాఠశాలలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల చిన్నారులకు గురువారం నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. సుమారు 200 మందికిపైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరాన్ని ఏఈడీ కో ఆర్డినేటర్ సెల్వరాజ్, ఎంఈవో సాంబశివరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన పరికరాలు పొందేందుకు వీలవుతుందన్నారు. శిబిరాన్ని ఏపీసీ వరదా సుబ్బారావు పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎల్ఎస్‌సీ కె.శ్రీనివాసరావు, వైద్యులు మాధురి, కరుణాకర్, ఎల్ విజయలక్ష్మి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం



సబ్ స్టేషనులో బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఈఈ నూతలపాటి సింగయ్య

**పాలువాయి (రెంటచింతల):** వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యమని ఏపీ ట్రాన్స్‌కో మాచర్ల ఈఈ నూతలపాటి సింగయ్య అన్నారు. గురువారం మండలంలోని పాలువాయి గ్రామంలోని 11/33 కె.వి. సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన బ్రేకర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇళ్లకు, వ్యవసాయ కనెక్షన్‌లకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించడానికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఏఈ మస్తాన్‌వలి, ఎల్ఐ శ్రీనివాసరావు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 16న నాగమ్మ శైవ క్షేత్ర పునః ప్రతిష్ట

**టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి**



మాట్లాడుతున్న జంగా కృష్ణమూర్తి

**దాచేపల్లి:** పల్నాడు జిల్లాకు తలమానికంగా నాగమ్మ శైవ క్షేత్రం కాబోతుందని టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి అన్నారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడులో ఈనెల 16న నాగమ్మ శైవక్షేత్రం పునః ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడు తొలి మహిళ మంత్రిని నాయకురాలు నాగమ్మ నిర్మించిన ఈ శైవ క్షేత్రం అద్భుత కట్టడమన్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో పునః ప్రతిష్ఠ కార్యక్రమ పూజలు జరుగుతాయని వెల్లడించారు. సమావేశంలో సర్పంచ్ గంగా సురేష్, పిడుగురాళ్ల జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, తదితరులు ఉన్నారు.

## అమ్మవారికి పుష్పయాగం





ప్రత్యేక అలంకరణలో వాసవి మాత, పుష్పాలతో తరలివచ్చిన మహిళలు

**దాచేపల్లి:** స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి మాత ఆలయ తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా తొలి రోజు పుష్పయాగం జరిపారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మాశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా ఐదు క్వింటాళ్ల పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అమ్మవారి ప్రసాద వితరణ జరిగింది. రెండు రోజుల పాటు పూజలు జరుగుతాయని వెల్లడించారు.

### విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు రాయితీ

**పిడుగురాళ్ల:** గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు ఏపీసీపీడీసీఎల్ రాయితీ ప్రకటించిందని పిడుగురాళ్ల ఏఏవో పి. సందీప్‌కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగ సురేష్‌బాబులు ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. అందుకు అయ్యే చార్జీలులో 50 శాతం రాయితీ ప్రకటించిందని, ఈ అవకాశం మార్చి ఒకటి తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు.

### కుటుంబ ప్రగతికి ఇల్లాలే కీలకం



**పిడుగురాళ్ల రూరల్:** కుటుంబం సామాజికంగా, ఆర్థికంగా ముందుకు వెళ్లాలంటే ఇల్లాలే కారణమని జిల్లా చైల్డ్ కౌన్సిల్ ఆఫీసర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో మహిళలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ... మహిళలు చదువుకుంటే ఆ కుటుంబం ఆర్థికంగా ఎదుగుతుందని అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంజలికుమారి, కోటేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### కిడ్నీ వ్యాధులపై అవగాహన



**మాచర్ల:** మాచర్ల పట్టణంలోని కమ్యూనిటీ వైద్యశాల డయాలసిస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం కిడ్నీ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్య అధికారి డాక్టర్ ఎ.ఉదయభాను, డాక్టర్ కె.పి.చారి, డాక్టర్ కె.జయప్రకాష్‌లు కిడ్నీ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### మిస్సింగ్ కేసులో స్వల్ప వివాదం

**విజయపురిసౌత్:** మిస్సింగ్ కేసులో పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చిన బాలికపై తల్లి చేయి చేసుకోవడంతో పోలీసులు తల్లిని బయటకు పంపడంతో బంధువులు స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సంఘటన మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. విజయపురిసౌత్‌లో నివాసం ఉండే ఓ బాలిక రెండు రోజులుగా కనిపించక పోవడంతో బంధువులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు బాలిక ఆచూకీ కనుగొని స్టేషన్ తీసుకొచ్చారు. బాలిక తల్లి స్టేషన్‌లోనే ఆమెపై చేయిచేసుకోవడంతో పోలీసులు తల్లిని బయటకు లాగేశారు. దీంతో బంధువులు పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. అనంతరం పోలీసులు వారిని చెదరగొట్టి పంపించి వేశారు.

## వైభవంగా వసంతోత్సవం





విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు

**సత్రశాల (రెంటచింతల):** మండలంలోని సత్రశాల వద్దనున్న కృష్ణానది తీరాన వేంచేసిన అతి పురాతనమైన శైవక్షేత్రం శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో గురువారం వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు చిట్టేల మల్లికార్జునశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలను జరిపించారు. మహాశివరాత్రి వెళ్లిన 16 రోజులకు జరిపే ఈ వేడుకలో భాగంగా స్వామి వారి కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు, మల్లికార్జున స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. మంచికల్లు గ్రామానికి చెందిన శీలంనేని వెంకట శివయ్య దంపతులు వేడుకలలో పాల్గొన్న భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఈవో గాదె రామిరెడ్డి, పాలువాయి సర్పంచ్ మందలపు విజయలక్ష్మి, కమిటీ సభ్యులు, మందలపు హనిమిరెడ్డి, గుండా శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ లక్ష్మీకుమారి

**మాచర్ల:** నిరుద్యోగాన్ని తగ్గించడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కృషి చేస్తోందని పల్నాడు జిల్లా అధికారి ఇ.తమ్మాజీరావు గురువారం పేర్కొన్నారు. ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ పట్టణంలోని ఎస్‌కేబీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించామన్నారు. ఐదు కంపెనీలు 70 మందిని ఉద్యోగానికి ఎంపిక చేశాయని వెల్లడించారు. ముఖ్య అతిథిగా ఎస్‌కేబీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.లక్ష్మీకుమారి మాట్లాడుతూ... నియామక పత్రాలు అందుకున్న యువతకు అభినందనలు తెలిపారు. జిల్లా ఉద్యోగ కల్పనాధికారి ఎం. రవీంద్ర నాయక్, మాచర్ల స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఆర్. కిరణ్ నాయక్, సీడాప్ జాబ్స్ కో ఆర్డినేటర్ నని నాయక్, కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సాయం



విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేస్తున్న సభ్యులు

**మాచర్ల రూరల్:** విద్యార్థులకు ఉచితంగా క్రీడా సామగ్రి, దుస్తులు అందించిన సీనియర్ న్యాయవాది చిలమకూరి నాగిరెడ్డి సేవా గుణం అమూల్యమని మదర్ థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు గాదె కిరీటిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కంభంపాడు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు క్రీడా సామగ్రి, దుస్తులను అందించారు. తర్వాత మాట్లాడుతూ... రూ. 15వేల విలువైన ఆట వస్తువులు, క్రీడా దుస్తులను అందించారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు జక్కిరెడ్డి మర్రెడ్డి, హెచ్ఎం ఆర్ విజయ్‌కుమారి, మోరా భాస్కర్‌రెడ్డి, యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, తుమ్మా ఆంథోనిరెడ్డి, కె. శాంతిరెడ్డి, లపాపిరెడ్డి, ఉపాధ్యాయులు కర్తయ్య, షేక్ జబ్బార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధులపై అప్రమత్తత ముఖ్యం




వైద్య శిబిరంలో డాక్టర్ పద్మావతి, సిబ్బంది

**మాచర్ల రూరల్:** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్' ఎల్ పద్మావతి కోరారు. గురువారం మండల పరిధిలోని కంభంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని మంచికల్లు గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. పరిశుభ్రత పాటించాలని సూచించారు. వృద్ధులు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ డి మురళీధర్, ఎంఎల్ హెచ్‌పీ అమరేంద్ర, ఈటీటీ కన్నెబోయిన సాంబశివరావు, కె.శాంతి కుమారి తదితరులున్నారు.

## యజమానుల చేతికి విలువైన సెల్‌ఫోన్లు

**నరసరావుపేట:** జిల్లాలో దొంగిలించబడిన, పోగొట్టుకున్న సుమారు రూ.31.22 లక్షల విలువైన 223 సెల్‌ఫోన్లను రికవరీ చేసిన పల్నాడు జిల్లా పోలీసులు వాటి యజమానులకు అందజేశారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు యజమానులకు వారి సెల్‌ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సమాచార చేరవేతకు, వినోదానికి, విజ్ఞాన సముపార్జన కోసం మొబైల్ ఫోన్లు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. చాలా సందర్భాల్లో ప్రజలు తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకోవడం లేదా దొంగలింపబడటం వలన చాలా ఇబ్బందులను ఎదుర్కొంటూ ఏమి చేయాలో దిక్కు తోచలేని పరిస్థితుల్లో పోలీసు వారిని ఆశ్రయిస్తున్నారన్నారు. తమ పోలీసులు పోయిన సెల్‌ఫోన్ల వివరాలను రాబట్టి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వాటిని వెతికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేకుండా బాధితులకు అందజేస్తున్నారన్నారు. ఎవరైనా ప్రజలు తమ మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగతనానికి గురైతే వెంటనే సీఇఐఆర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. పోయిన సెల్‌ఫోన్లు తమకు అందినందుకు వాటి యజమానులు సంతోషం వ్యక్తం చేశారు.

### సందడిగా హోలీ సంబరాలు



**పిడుగురాళ్ల:** మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలోని బోధి పాఠశాల నందు హోలి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సునీతరెడ్డి మాట్లాడుతూ... పండగను పర్యావరణ హితంగా, సురక్షితంగా చేసుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం బాలల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

### సీపీఎం 'ప్రజా చైతన్య యాత్ర'

**పిడుగురాళ్ల:** సీపీఎం ప్రజా చైతన్య యాత్ర రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని గాంధీనగర్, సుందరయ్య కాలనీలో సీపీఎం బృందం గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ... గాంధీనగర్‌లోని గంటేలపల్లి అమరేశ్వరరావుకు కరెంటు బిల్లు ఎస్సీ కేటగిరి కింద నమోదైనప్పటికీ రూ. 73,125 వచ్చిందని పేర్కొన్నారు. రేషన్ బియ్యం సరిగా ఇవ్వడం లేదని తెలిపారు. సుందరయ్య కాలనీలో వీధిలైట్లు, సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, కాలనీ వాసులు గోవిందు, మస్తాన్‌వలి, షేక్ సైదా, వెంకటరత్నం, షేక్ సిలర్, భూలక్ష్మి, బీబిలి తదితరులు పాల్గొన్నారు.

### బంగారం చోరీ

**దాచేపల్లి:** మండలంలోని మాదినపాడు గ్రామంలో గురువారం ఓ ఇంట్లో చోరీ జరిగింది. స్థానికుడైన వెంకటేశ్వర్లు, తన కుటుంబ సభ్యులతో వ్యవసాయ పనులకు వెళుతున్నప్పుడు ఇంటికి తాళం వేసి వెళ్లారు. చోరులు సుమారు రూ. 2 లక్షల నగదు, బంగారం చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.